RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శనివారం, ఆగస్టు 29, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 121 | పేజీలు: 8 | వెల : రూ.1



**తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్..**

**ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు**

తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు



## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళా నేతలు

### రాఖీ పౌర్ణమి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆత్మీయ వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 28:లి రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి మహిళా మంత్రులు, మహిళా నాయకులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శు క్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, కమిషన్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మలక్‌పేట్ గవర్నమెంట్ హైస్కూల్ ఫర్ ది బ్లైండ్ గర్ల్స్‌కు చెందిన విద్యార్థినులు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాఖీలు కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా ముచ్చటించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది.

# ఫ్యూచర్‌సిటీ రియల్ ఎస్టేట్ జోరు

హైదరాబాద్, ఆగస్టు 28 : భారత్ ఫ్యూచర్‌సిటీలో రియల్ ఎస్టేట్ భూం నడుస్తోంది. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన 121 చదరపు గజాల ప్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. గతంలో సుమారు రూ.5 లక్షలకు అమ్ముడైన ప్లాట్లు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతున్నాయి. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం ప్రారంభం, పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల పెరుగుదలతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట–ముచ్చర్ల గ్రామాల మధ్యలో దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. దీంతో ఆ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీలో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన లే–అవుట్లు, స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చిన 6 వేల మంది రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్లను కేటాయించింది. నిర్వాహిసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారంతో పాటు 121 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లు ఇచ్చింది.మీర్‌ఖాన్‌పేట్, పంజాగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో నివసిస్తున్న రైతుల నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు దశల్లో భూములను తీసుకుంది. ఆయా గ్రామాల ప్రజలకు పంజాగూడ రెవెన్యూ పరిధిలో లేఅవుట్లు డెవలప్ చేసింది. దాదాపు 6 వేల మంది రైతులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించింది. రైతుల పిల్లలు చదువుకునేందుకు వీలుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల స్కూల్ సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే అక్కడి లే–అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు కొందరు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం, ప్లాట్ అమ్మితే వచ్చే డబ్బుతో హైదరాబాద్ దగ్గర్లో భూములు కొనాలని నిర్ణయించారు. ఒకరిద్దరు రైతులు ఏడాది క్రితం విక్రయించగా.. 121 చదరపు గజాల ప్లాటు రూ.5 లక్షలకు అమ్ముడయ్యింది.తాజాగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. ఫ్యూచర్‌సిటీ



కార్యాలయం రెండు నెలల క్రితం ప్రారంభమవగానే.. ప్లాట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో నిన్న మొన్నటి వరకు చదరపు గజం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ధర పలకగా.. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్ల ధర అనూహ్యంగా పెరిగింది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఒక్కో ప్లాటు అమ్ముడవుతోంది. అంటే దాదాపు 10 వేల నుంచి రూ.23 వేల వరకు గజం పలుకుతోంది. జులైలో ఒక రైతు తన ప్లాటును రూ.28 లక్షలకు విక్రయించారు. ఆ ప్లాట్లను కొంటే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు వేగంగా సమకూరుతాయన్న అంచనాతో కొందరు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు కొనే ఆర్థిక స్థోమత లేని వారు భవిష్యత్ పెట్టుబడిగా ఫ్యూచర్ సిటీలో స్థలాలు కొనేందుకు రెడీ అవుతున్నారు



## హట్టి-సింగరేణి చేతులు కలపాలి

### భవిష్యత్ ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్

### అవకాశాలను పరిశీలించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 28: బంగారం అన్వేషణ, మైనింగ్, ప్రాసెసింగ్, రిఫైనింగ్ రంగాల్లో హట్టి గోల్డ్ మైన్స్, సింగరేణి సంస్థలు కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక–-ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ ప్రాజెక్టుల్లో ఇరు సంస్థల మధ్య జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కర్ణాటకలోని బంగారు గనుల ప్రాంతాల్లో తన పర్యటనలో రెండో రోజు శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటీ గోల్డ్ మైన్స్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. బంగారు ఖనిజం వెలికితీత నుంచి శుద్ధి చేసిన బంగారం తయారీ వరకు జరుగుతున్న వివిధ ప్రక్రియలను ఆయన పరిశీలించారు.

**హట్టి అనుభవం.. సింగరేణి సాంకేతిక సామర్థ్యం**

హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, మైనింగ్, ప్రాసెసింగ్, రిఫైనింగ్‌లో విస్తృత అనుభవం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణికి బొగ్గుతో పాటు ఇతర ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌లో ఉన్న సాంకేతిక సామర్థ్యాన్ని హట్టి సంస్థ అనుభవంతో అనుసంధానిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. బంగారం అన్వేషణ, మైనింగ్, వెలికితీత, ప్రాసెసింగ్, రిఫైనింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాంకేతిక నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ వంటి రంగాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

**బంగారం ఉత్పత్తి పెంచాలి**

దేశ ఆర్థిక భద్రతలో బంగారానికి కీలకమైన ప్రాధాన్యత ఉందని భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలని సూచించారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి–-సింగరేణి భాగస్వామ్యం ద్వారా బంగారం ఉత్పత్తి పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**మైనింగ్ నుంచి రిఫైనింగ్ వరకు పరిశీలన**

హట్టి గోల్డ్ మైన్స్‌లోని ఉత్పత్తి యూనిట్, ఖనిజ శుద్ధి ప్లాంట్, ఎలక్ట్రోవిన్నింగ్ సదుపాయాలను భట్టి విక్రమార్క పరిశీలించారు. గనుల నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి

(మిగతా 2వ పేజీలో)



## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

- త్వరలో మరో జాబితా
- మరో 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా
- జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతగా 7,350 ఇళ్ల కేటాయింపు
- అర్హతే ప్రామాణికం.. కులం, మతం, రాజకీయాలకు చోటు లేదన్న మంత్రి

## హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు రూ.269 కోట్లు!



- హైదరాబాద్ రాయదుర్గంలో మరోసారి భూముల రికార్డు ధర
- ఎకరం రూ. 269 కోట్లకు పలికిన ప్రభుత్వ భూమి
- భూమిని దక్కించుకున్న వంశీరాం బిల్డర్స్
- ఈ వేలంతో ప్రభుత్వానికి 1,447 కోట్ల ఆదాయం

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ‘గొడ్డలి పార్టీ’ దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శు క్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో ‘కాఫీ కబుర్లు’ కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే

(మిగతా 2వ పేజీలో)

## తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నంకు ‘సర్’ నోటీసులు

- తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసులు జారీ
- ఓటర్ల జాబితాలో తండ్రి పేరు తప్పుగా ఉండటమే కారణం
- సర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల అందజేత
- పేరు సవరణ కోసం పత్రాలు సమర్పించిన మంత్రి



తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే. ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు
శనివారం, ఆగస్టు 29, 2026

# జపాన్ సంస్థతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భాగస్వామ్యం



హైదరాబాద్, ఆగస్టు 28: తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందించేందుకు జపాన్‌లోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తున్నామని శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హెచ్‌ఐటీ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) మధ్య భాగస్వామ్యానికి సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని వెల్లడించారు. జపాన్ పర్యటనలో భాగంగా మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం శుక్రవారం హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థ నాయకత్వంతో తెలంగాణలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల తయారీపై విస్తృతంగా చర్చించారు.

### విద్యార్థుల మార్పిడికి ప్రాధాన్యం

తొలిదశలో పరస్పర అవగాహనతో భాగస్వామ్యాన్ని ప్రారంభించి, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతికత, పరిశ్రమల అవసరాల ఆధారంగా సహకార రంగాలను సంయుక్తంగా గుర్తించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. హెచ్‌ఐటీ--వైఐఎస్‌యూ భాగస్వామ్యంలో విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాన్ని కీలకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా తెలంగాణ విద్యార్థులకు జపాన్ సాంకేతిక విద్యా విధానం, ప్రయోగశాల ఆధారిత శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానమైన విద్యా విధానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశాలను కూడా అందించనున్నారు.

### అధ్యాపకులకు శిక్షణ

అధ్యాపకులు, శిక్షకుల నైపుణ్యాభివృద్ధి, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ), స్వల్పకాలిక సాంకేతిక కోర్సులు, పరిశోధన, పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. తెలంగాణలో స్థానిక అవసరాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్య రంగాలను ఎంపిక చేయనున్నారు. అధునాతన తయారీ, మొబిలిటీ, ఆటోమొబైల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలు, పర్యావరణ సాంకేతికత వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం పెంచుకోవడంపై చర్చించారు.

### పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి ఇంజినీరింగ్ రంగంలో ఉన్న సామర్థ్యాలు తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అనుకూలంగా ఉన్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కేవలం సంప్రదాయ విద్యా మార్పిడికి పరిమితం కాకుండా.. నైపుణ్యాలు, ఉపాధి సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పరిశ్రమల అవసరాలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జపాన్ సాంకేతికత, తయారీ రంగం, పరిశ్రమల ఆధారిత విద్యా విధానంలోని ఉత్తమ పద్ధతులను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని అన్నారు. తరగతి గది, ప్రయోగశాల విద్యను వాస్తవ పరిశ్రమల సవాళ్లు, పరిశోధనతో అనుసంధానించే హెచ్‌ఐటీ విధానంపై తెలంగాణ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి చూపింది. ఇలాంటి విధానాలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణ సాంకేతిక విద్యా వ్యవస్థలో ఎలా అమలు చేయవచ్చనే అంశంపై చర్చించారు.

### హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానం

హెచ్‌ఐటీ ప్రతినిధులను హైదరాబాద్‌కు వచ్చి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. తదుపరి చర్చల ద్వారా భాగస్వామ్యానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న లి'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026'లిలో పాల్గొని తెలంగాణతో మరిన్ని సంస్థాగత, పారిశ్రామిక భాగస్వామ్యాలను పరిశీలించాలని హెచ్‌ఐటీ ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. జపాన్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలతో నేరుగా సంస్థాగత సంబంధాలను ఏర్పరచుకోవడంలో ఈ భాగస్వామ్యం మరో కీలక ముందడుగని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్య, నైపుణ్యాలు, పరిశ్రమల అనుభవాన్ని తెలంగాణ యువతకు అందించేందుకు ఇటువంటి భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

(మొదటి పేజీ తరువాయి)


కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని



దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు.గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019–24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# నాగబాబుకు కీలక బాధ్యతలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పచ్చదనంతో నింపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'ఏపీ గ్రీన్' కార్యక్రమానికి మరింత ఊతం లభించింది. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం మేర అడవులు, చెట్లను పెంచాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో కీలక బాధ్యతలను జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు అప్పగించారు. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించింది.మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నాగబాబు తన సతీమణి పద్మజతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన ధ్యేయమని నాగబాబు స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు కుటుంబ సభ్యుల నుంచి కూడా అభినందనలు వెల్లువెత్తాయి. మెగాస్టార్ చిరంజీవి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రకృతిపై నాగబాబుకు ఉన్న మక్కువకు తగినట్లుగా ఈ బాధ్యత దక్కిందని పేర్కొన్నారు. పచ్చని, మెరుగైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామి కావడం గర్వకారణమని చెబుతూ, కొత్త బాధ్యతల్లో నాగబాబు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తన సోదరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిపై అపారమైన ప్రేమ ఉన్న నాగబాబు.. పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో విజయవంతం అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. నాగబాబుకు క్యాబినెట్ హోదా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, మద్దతు తెలిపిన కూటమి నేతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు బాధ్యతలు చేపట్టిన అనంతరం నాగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సతీమణి పద్మజతో కలిసి ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన ఆయన.. చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగబాబు దంపతులను సీఎం సత్కరించి, నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు.నాగబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి అటవీ, పర్యావరణ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరై అభినందనలు తెలిపారు. పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు వై. శ్రీనివాసరెడ్డి, పీసీసీఎఫ్ విజిలెన్స్ రేవతి, ఏపీ గ్రీన్ సీసీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీఎన్ఎన్ మూర్తి తదితరులు నాగబాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, డిప్యూటీ సీఎం ఓఎస్డీ వెంకటకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పంచకర్ల సందీప్ తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపారు.




# తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్..

## ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

**తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు**

**నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన**

**సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల**

**తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు**

తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023–24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025–26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం. కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం. మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

# ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?: కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్

**కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల**

**సన్న బియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫొటో వేయడం లేదని మండిపాటు**

**కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య**

తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్–1, ఫేజ్–2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

# హట్టి-సింగరేణి చేతులు కలపాలి

శుద్ధి చేసిన బంగారంగా మార్చే ప్రక్రియను అధికారులు ఆయనకు వివరించారు. హట్టి ప్రాజెక్టులో రోజుకు సగటున 2 నుంచి 4 కిలోల వరకు బంగారం ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం యూటీ ఓపెన్‌కాస్ట్ గోల్డ్ మైన్ వ్యూపాయింట్‌ను సందర్శించిన భట్టి విక్రమార్క.. బంగారు ఖనిజం వెలికితీస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఓపెన్‌కాస్ట్ గనిలో ఏ లోతు నుంచి ఖనిజాన్ని వెలికితీస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనికి సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి, బంగారం అన్వేషణకు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై వివరాలు తెలుసుకున్నారు. గని ప్రాంగణంలో అధికారులు డిప్యూటీ సీఎం చేత మొక్కను నాటించారు.

### అండర్‌గ్రౌండ్ మైనింగ్‌పై ఆరా

తర్వాత యూటీ అండర్‌గ్రౌండ్ గోల్డ్ మైన్‌లో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలను భట్టి విక్రమార్క పరిశీలించారు. భూగర్భ గనుల్లో ఖనిజం వెలికితీత, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులేశ్‌రెష్ట, రాయచూర్ జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ సీనియర్ అధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ్, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిర్ సాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నంకు'సర్' నోటీసులు

సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్‌ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ రాఖీలు కట్టిన మహిళలు సోదరీమణులు



కుత్బుల్లాపూర్ ఆగష్టు 28(వాయిస్ టుడే): షాపూర్ నగర్ రాఖీ పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పాటు వారి సోదరుడు మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు శ్రీ కూన శ్రీనివాస్ గౌడ్ నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో షాపూర్ నగర్‌లోని వారి నివాసానికి విచ్చేసి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మరియు వారి సోదరుడు శ్రీనివాస్ గౌడ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాఖీలు కట్టడం పట్ల కూన శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళల అభిమానం, ఆప్యాయత తనకు ఎప్పటికీ ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు.అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ సాక్ష్యంగా నిలుస్తుంది అన్నారు,సమాజంలో మహిళలకు ప్రతి ఒక్కరు మర్యాదలు ఇవ్వాలని, సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు, ప్రతి ఒక్కరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలు పద్మ , లావణ్య, శ్యామల, సంగీత, అనిత, లతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ పోలింగ్ స్టేషన్లలో ఈఆర్ఓ పింకేష్ కుమార్ ఐఏఎస్ తనిఖీ

కుత్బుల్లాపూర్ ఆగష్టు 28(వాయిస్ టుడే): 28.08.2026న, ఈ ఆర్ ఓ ఑ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐ ఏ ఎస్ అధికారులతో కలిసి 045-కుత్బుల్లాపూర్ అసెంబ్లి నియాజకవర్గం లో గాజులరామారం సర్కిల్-57 పరిధిలోని పోలింగ్ స్టేషన్ల లో పర్యటించారు.పర్యటన లో భాగంగా పోలింగ్ స్టేషన్ల లో కొనసాగుతున్న నోటీసులు జారీ చేసే ప్రక్రియను సమీక్షించారు . అలాగే నోటీసులు జారీ చేసిన తరవాత విచారణలు నిర్వహించే ప్రక్రియను గురించి బి. ఎల్. ఓ.ల తో మాట్లాడారు.విచారణకు వచ్చిన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ఏరో ఑ ఉప కమిషనర్ యూ .వెంకట్ రాములు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# ఘనంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగు నూరి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్ ఆగష్టు 28(వాయిస్ టుడే): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దూలపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి. శివకుమార్ గౌడ్ హాజరై శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డికి శు భాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రహీం, నవీన్, శివాజీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



# భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి శాలువాతో సత్కరిస్తున్న భువనగిరి పట్టణ కాంగ్రెస్ నాయకులు

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్గా నియమాకమై పదవి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మొదటిసారిగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హిరేకర్ శీను స్వాగతం పలికి శాలుతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల చైర్మన్ అవేసి చిస్తి, పీసీసీ డెల్ గెట్ తంగళ్ళపల్లి రవికుమార్, పీసీసీ కార్యదర్శి పత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, భువనగిరి పట్టణ ప్రెసిడెంట్ కూర వెంకటేష్, కౌన్సిలర్లు బింగి నరేష్, బొంతల నరసింహ, కో ఆప్షన్ సభ్యులు కౌసర్ బాయ్, పిట్టల బాలరాజ్, ఈరపాక నరసింహ, అత్తర్, పులిగిల్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ ధరకే నాణ్యమైన బోల్ట్ ఇట్ ఇంజిన్ ఆయిల్

### ... నాచారం పారిశ్రామిక వాడలో లాంఛనంగా ప్రారంభం

నాచారం (వాయిస్ టుడే): నాచారం ఇండస్ట్రీస్ ప్రాంతంలో ఈవీ జాజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బోల్ట్ ఇట్ ఎక్స్‌ప్రెస్' ఇంజిన్ ఆయిల్‌ను శుక్రవారం సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు. టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రేగులపాటి రమ్యారావు, సంస్థ చైర్మన్ అంకుల్ అగర్వాల్, రూపేష్ షా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజన్ శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ధరకే నాణ్యమైన ఇంజిన్ ఆయిల్ అందుబాటులోకి రావడం నగర వాహనదారులకు ప్రయోజనకరమన్నారు.

# ఇందిరాపార్క్ వద్ద TGEJAC మహాధర్నా విజయవంతం

**హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన ఉద్యోగులు, అధికారులు, పెన్షనర్లు**

**సుమారు 9 వేల మంది హాజరు.. ఉద్యమ అభినందనలు తెలిపిన TGEJAC నాయకత్వం**



హైదరాబాద్: ౧+జుజీూజ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ మహాధర్నా కార్యక్రమం విజయవంతమైంది. హైదరాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాధర్నాకు ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

హైదరాబాద్ నగరంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 9 వేల మంది ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు మహాధర్నాకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. భారీ సంఖ్యలో ఉద్యోగులు తరలిరావడంతో ఇందిరాపార్క్ పరిసరాల్లో సందడి నెలకొంది.

TGEJAC రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మహాధర్నాను విజయవంతం చేసేందుకు ఉద్యోగులు, అధికారులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మహాధర్నాకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు ౧+జుజీూజ హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ వూటు యశ్వంత్, హైదరాబాద్ సిటీ కన్వీనర్ డా. జి. గండూరి వెంకటేష్, జిల్లా కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డా. కె. రామారావు ఉద్యమ అభినందనలు తెలిపారు. మహాధర్నాను విజయవంతం చేసిన ప్రతి ఉద్యోగి, అధికారి, పెన్షనర్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లక్కీడ్రా ప్రారంభ కార్యక్రమం

కుత్బుల్లాపూర్ ఆగష్టు 28(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా ప్రారంభ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు పాల్గొని లక్కీ డ్రాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ... "సంవత్సరం తిరిగేలోపు ప్రతి ఆడబిడ్డకు సొంత ఇల్లు ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నారు." అని తెలిపారు.ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు గోడలు కాదు... ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుకు భరోసా అని అన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో


టీ. స్టాంప్ ప్రకాష్ -- ఆర్డీవో, కుత్బుల్లాపూర్ జి. సిద్ధార్థ -- ప్రాజెక్ట్ డైరెక్టర్, మేడ్చల్--మల్కాజ్‌గిరి విమల -- సెక్రటరీ, హౌసింగ్ బోర్డ్ వాణి -- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్అలాగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు -- ఇదే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం!



# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఘర్ వాపసీ

### - సనాతన ధర్మంలోకి దేశబతిని శ్రీనివాస్ పునఃఆహ్వానం

కుత్బుల్లాపూర్ ఆగష్టు 28(వాయిస్ టుడే): రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒక ఆత్మీయమైన "ఘర్ వాపసీ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మన హిందూ బంధువు దేశబతిని శ్రీనివాస్ అనివార్య కారణాల వల్ల గతంలో అన్యమతంలోకి వెళ్లడం జరిగింది. అయితే తన మూలాలను, సంస్కృతిని, ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుర్తుచేసుకుని, పండితుల వేద మంత్రోచ్చారణల సాక్షిగా తిరిగి హిందూ సనాతన ధర్మంలోకి ఆహ్వానించడం జరిగింది.సనాతన ధర్మం అనేది కేవలం ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాదు. ఇది మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలు, మానవత్వం, ధర్మబద్ధమైన జీవనం మరియు సమస్త జీవుల పట్ల గౌరవాన్ని బోధించే జీవన విధానం. "వసుధైవ కుటుంబకం" అనే విశాలమైన భావనతో ప్రతి ఒక్కరి శ్రేయస్సును కోరే గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయం మన సనాతన ధర్మం.ఈ ఘర్ వాపసీ కార్యక్రమాన్ని ప్రేమ, ఆత్మీయత మరియు సోదరభావంతో నిర్వహించడం అభినందనీయం. ఎటువంటి ద్వేషానికి తావులేకుండా, మన సంస్కృతి మరియు ఆధ్యాత్మిక మూలాలను గుర్తుచేస్తూ దేశబతిని శ్రీనివాస్ తిరిగి సనాతన ధర్మంలోకి ఆహ్వానించడం పట్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు కంది శ్రీ రాములు ప్రత్యేకంగా అభినందిస్తున్నాము. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొని వేద మంత్రాలతో ఆశీర్వదించిన పండితులకు, సంఘ నాయకులకు, పెద్దలకు మరియు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరభావం, ధర్మబంధం, మన సంస్కృతి పట్ల గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ



వాయిస్
హైదరాబాద్
శనివారం 29 ఆగస్టు 2026



## పోతగాని గోపాల్ గౌడ్‌కు రాఖీ కట్టిన మహిళా నేతలు

నాచారం (వాయిస్ టుడే): రాఖీ పౌర్ణమి సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఇంటి వద్ద సందడి నెలకొంది. ఆయన



సోదరీమణులతో పాటు ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మహిళా నేతలు ఇంటికి చేరుకుని గోపాల్ గౌడ్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. "నేను మీకు రక్ష.. మీరు నాకు రక్ష.. మనందరం దేశానికి రక్ష" అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు మంజుల వాణి, సబితా యాదవ్, జ్యోతి, విజేత, మమత, లావణ్య, అనితతో పాటు పలువురు సోదరీమణులు పాల్గొన్నారు.



## నాచారంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

నాచారం (వాయిస్ టుడే): నాచారం కొన్నే ఇంద్రమ్మ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సోదర–-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



## సోదరుడికి రాఖీ కట్టిన ఉపేంద్ర

నాచారం (వాయిస్ టుడే): బీజేపీ నాయకులు మల్లికంటి వీరన్నకు ఆయన సోదరి ఉపేంద్ర రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే చెన్నై నుంచి వచ్చిన ఉపేంద్ర తన సోదరుడికి రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు.



## పీహెచ్‌డీ స్కాలర్ కిరణ్మయి నివాసంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నాచారం (వాయిస్ టుడే): పీహెచ్‌డీ స్కాలర్ కిరణ్మయి నివాసంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని సోదర–-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం పరస్పరం మిఠాయిలు పంచుకుని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.



అన్నా..చెల్లెళ్ల...ఆత్మీయ ప్రేమ బంధమే.. ఈ రాఖీ పండుగ..ఈ రాఖీ పండుగను.. ఉప్పల్ పోలీస్ స్టేషన్లో.. సహచర ఉద్యోగులతో.. ఉప్పల్ ఇన్స్పెక్టర్.. రామలింగారెడ్డి..ఆధ్వర్యంలో మహిళ (పురుషులు )ఎస్సైలు.. ఏఎస్ఐలు.. కానిస్టేబుల్స్.. జరుపుకోవడం నిజంగా ఎంతో ఆనందదాయకం.

– ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)

## స్కామ్ కేసులో రూ.4.50 లక్షలు రికవరీ

### బోరబండ పోలీసుల సేవలకు బాధితుడి కృతజ్ఞతలు



హైద్రాబాద్ 28 ఆగష్టు (వాయిస్ టుడే ) : బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఆన్‌లైన్ స్కామ్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించి బాధితుడికి రూ. 4.50 లక్షల నగదును రికవరీ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు షేక్ మహమ్మద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. తన ఆన్‌లైన్ స్కామ్ కేసును విజయవంతంగా పరిష్కరించి, కష్టపడి సంపాదించిన డబ్బును తిరిగి రికవరీ చేసిన.. హైదరాబాద్ కమిషనర్ సజ్జనర్.. బోరబండ సీఐ రవి కుమార్ , డీఐ సైదులు గార్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల కృషి, సేవలను అభినందిస్తూ వారికి గౌరవంతో సెల్యూట్ చేస్తున్నానని ఇర్ఫాన్ పేర్కొన్నారు.



అన్నా..చెల్లెళ్ల...ఆత్మీయ ప్రేమ బంధమే.. ఈ రాఖీ పండుగ..ఈ సందర్భంగా ఉప్పల్ లో..మన్నె భీమన్న గారి.. ఆరూష్ చంద్ర.. ఆర్యన్ ధీరలకు.. రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేస్తున్న..నందన.. సితార.. విధాత్రిల దృశ్యం.

– ఉప్పల్ ( వాయిస్ టుడే ప్రతినిధి)



## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నాచారం (వాయిస్ టుడే): డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ నివాసంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరీమణులు రాఖీలు కట్టి సోదరుల నుంచి ఆశీర్వాదాలు పొందారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా గండికోట కుమార్ మాట్లాడుతూ సోదర, సోదరీమణుల మధ్య ఆత్మీయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మణికేశ్వరి నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



## కాన్షిరామ్‌కు అభినందనలు


నాచారం (వాయిస్ టుడే): నల్లా రాధాకృష్ణ కుమారుడు నల్ల కాన్షిరామ్ జన్మదినం సందర్భంగా నాచారం లో మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇటీవల జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించి, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌లో ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్)లో ప్రవేశం పొందిన సందర్భంగా కాన్షిరామ్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు, విద్యాపరమైన అభినందనలు తెలిపిన మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ నల్లా రాధాకృష్ణ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





అన్నా..చెల్లెళ్ల...ఆత్మీయ ప్రేమ బంధమే.. ఈ రాఖీ పండుగ..ఈ సందర్భంగా హైదరాబాదులోని వారి నివాసంలో రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్పు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేస్తున్న.. భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లుల దృశ్యం.

– యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి





## జవాన్లకు 'మై గిఫ్ట్' ఆత్మీయ రక్షాబంధన్...

హైదరాబాద్: 'మై గిఫ్ట్' ఆధ్వర్యంలో ఆర్మీ క్యాంపస్‌లో రక్షాబంధన్ వేడుకలను ఆత్మీయంగా నిర్వహించారు. ప్రముఖ జాతీయ కవి, బహుభాషావేత్త, 'మై గిఫ్ట్' రూపశిల్పి డా. పెరుక రాజు దేశ రక్షణలో నిరంతరం సేవలందిస్తున్న భారతీయ సైనికులకు రాఖీలు కట్టి, మిఠాయిలు అందజేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్, పరస్పర ప్రేమ, రక్షణ, బాధ్యతలకు ప్రతీకగా నిలిచే భారతీయ సంస్కృతిలోని విశిష్ట పండుగ. దేశ సరిహద్దులను కాపాడే జవాన్లకు రాఖీ కట్టడం ద్వారా "దేశాన్ని రక్షించే చేతికి దేశ ప్రజల ఆత్మీయతే రక్ష" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ సందర్భంగా డా. పెరుక రాజు మాట్లాడుతూ, ఇలాంటి పండుగలు సైనికులు, ప్రజల మధ్య ఆత్మీయ బంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు జాతీయ భావాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పండుగలు కేవలం సంప్రదాయాలకు పరిమితం కాకుండా ఐక్యత, ప్రేమ, దేశభక్తిని తరతరాలకు అందించే సాంస్కృతిక వారధులని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్, పెరుమాళ్, హిరా, గణేష్, పాండి, అమన్ పాల్గొన్నారు.

# ఉచిత పథకాలతో ప్రజలను దద్దమ్మలను చేయకండి

## ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు అండగా నిలవండి.. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచండి

## "త్యాగం ఒకరిది.. యోగం మరొకరిది.. భోగం ఇంకొకరిది" అంటూ పాలకులపై చిదురుప్ప సువర్ణారెడ్డి ఆగ్రహం



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, వాయిస్ టుడే ప్రతినిధి: ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు సుభిక్షంగా జీవించాలంటే ప్రతి పౌరుడికి విద్య, వైద్యం, కూడు, గూడు వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, స్వచ్ఛంద సేవా తత్పరురాలు చిదురుప్ప సువర్ణారెడ్డి అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని రాయిగిరిలో తన స్వగృహంలో 'వాయిస్ టుడే' జిల్లా ప్రతినిధి మండవ శ్రీశైలంతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### తెలంగాణ కోసం ఎందరో త్యాగాలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమంలో ఎందరో త్యాగాలు చేశారని సువర్ణారెడ్డి అన్నారు. వేలాది మంది విద్యార్థులు, ఉద్యమకారుల ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. "త్యాగం ఒకరిది.. యోగం మరొకరిది.. భోగం ఇంకొకరిది అన్న చందంగా నేటి తెలంగాణ పరిస్థితి మారింది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.

### యువతకు ఉద్యోగాలు కల్పించాలి

రాష్ట్రంలో యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని ఆమె అన్నారు. ఉపాధి అవకాశాలు లేక కొంతమంది యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, ప్రైవేట్ కంపెనీలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణ ఏది?

గత, ప్రస్తుత పాలక ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూముల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని సువర్ణారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. "ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నప్పుడు అధికారుల నిఘా ఏమైంది? ఇదేనా బంగారు తెలంగాణ?" అని ఆమె ప్రశ్నించారు.

### ఉచిత పథకాలు కాకుండా ఉపాధి కల్పించాలి

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు, ఉచిత పథకాలపై ఆమె విమర్శలు చేశారు. ప్రజలకు ఉచిత పథకాలు అందించడంతో పాటు వారు స్వయం సమృద్ధి సాధించేలా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "పాలకులారా.. ఉచిత పథకాలతో ప్రజలను దద్దమ్మలను చేయకండి. ప్రజలకు ఉపాధి కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయండి" అని ఆమె అన్నారు.

ఆర్టీసీపై ఆర్థిక భారం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఉచిత రేషన్ బియ్యం వంటి పథకాలపై ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే నిజమైన నిరుపేదలకు ఉచిత రేషన్ బియ్యం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు క్రమం తప్పకుండా పింఛన్లు అందించాలని ఆమె కోరారు.

### అర్హులకే సంక్షేమ పథకాలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన నిరుపేదలకు ఇళ్లు అందుతున్నాయా అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సువర్ణారెడ్డి అన్నారు. రాజకీయ జోక్యంతో అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వందల ఎకరాల భూములు ఉన్నవారికి కూడా రేషన్ కార్డులు, పింఛన్లు, రైతు సంక్షేమ పథకాలు అందుతున్నాయా అనే అంశంపై ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు మాత్రమే చేరేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు.

### అన్నదాతకు అండగా నిలవాలి

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు ప్రభుత్వం మరింత అండగా నిలవాలని ఆమె అన్నారు. రైతు కుటుంబాలను ఆదుకోవడం కోసం ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న అర్హులైన రైతులకు రైతుబంధు వంటి పెట్టుబడి సాయం అందించాలని కోరారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు.

### పేద విద్యార్థులకు అండగా ఉంటా

నిరుపేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, వసతి గృహాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని సువర్ణారెడ్డి అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థులు తనను నేరుగా సంప్రదిస్తే తనకు చేతనైనంత సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు, రైతుల అభివృద్ధి, నిరుపేదలకు విద్యా--వైద్య సౌకర్యాల కల్పనకు పాలకులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు.



## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్ట్ 28 (వాయిస్ టుడే): వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథి గా హాజర య్యారు.ఈ సందర్భం గా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్ష లు తెలియ జేశారు.ఈ సందర్భం గా విప్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యం తో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# రెండో తిరుపతిగా యాదాద్రి.. నిత్య కళ్యాణం.. పచ్చతోరణాలతో భక్తుల సందడి

## నిత్యం 1,500--2,000 మందితో గిరి ప్రదక్షిణ.. కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు

## సాంస్కృతిక విద్యాపీఠం పునఃప్రారంభం.. రూ.10.6 కోట్లతో భవనాలు, హాస్టల్‌కు ప్రతిపాదనలు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, వాయిస్ టుడే ప్రతినిధి: తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా, రెండో తిరుపతిగా పేరుగాంచిన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నిత్యం భక్తుల సందడితో కళకళలాడుతోంది. స్వామివారి దర్శనం కోసం తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతోంది. మరోవైపు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. ఆలయంలో నిత్య కళ్యాణం, నిత్య అర్చనలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు తదితర కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ జరిగే పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. నిత్య కళ్యాణోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

### నిత్యం గిరి ప్రదక్షిణ

యాదాద్రి క్షేత్రంలో గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కింద స్వామివారి పాదాల వద్ద, వైకుంఠ ద్వారం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సన్నాయి మేళాల మధ్య సంప్రదాయ పద్ధతిలో గిరి ప్రదక్షిణ కొనసాగుతోంది. నిత్యం నిర్వహించే ఈ గిరి ప్రదక్షిణలో సుమారు 1,500 నుంచి 2,000 మంది వరకు భక్తులు పాల్గొంటున్నట్లు సమాచారం. గిరి ప్రదక్షిణలో భాగంగా కింద స్వామివారి పాదాలు, వైకుంఠ ద్వారం వద్ద భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వాష్‌రూమ్‌లు, లైటింగ్, ఆడియో తదితర సదుపాయాల ఏర్పాటుకు సుమారు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో సీఎస్ఆర్ నిధుల కింద ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

### పునఃప్రారంభమైన సాంస్కృతిక విద్యాపీఠం

యాదాద్రి ఆలయ ప్రాంగణంలోని సాంస్కృతిక విద్యాపీఠంలో డిగ్రీ కోర్సును ఈ ఏడాది నూతనంగా ప్రారంభించినట్లు సమాచారం. గత ఐదారు సంవత్సరాలుగా మూతపడిన ఈ కళాశాలను తిరిగి పునఃప్రారంభించినట్లు తెలుస్తోంది. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు హాస్టల్‌తో పాటు నూతన భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం సుమారు రూ.10.6 కోట్ల అంచనా వ్యయంతో హెచ్ఏఎల్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ప్రతిపాదనలు అమలైతే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

### ఆలయ సేవలో 600 మంది సిబ్బంది

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సుమారు 300 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 300 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. నిత్య పూజా కార్యక్రమాల నిర్వహణతో పాటు భక్తులకు అవసరమైన సేవలు అందించడంలో సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు.

భక్తుల విశ్వాసానికి ప్రతీకగా యాదాద్రి

స్వయంభువుగా వెలసిన యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల్లో బలమైన విశ్వాసం ఉంది. దీంతో యాదాద్రికి నిత్యం భక్తుల రాక కొనసాగుతోంది. నిత్య కళ్యాణాలు, ప్రత్యేక పూజలు, గిరి ప్రదక్షిణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో యాదాద్రి క్షేత్రం నిత్యం సందడిగా కనిపిస్తోంది. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనతో యాదాద్రి క్షేత్రం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది.



## అన్నా చెల్లెలు అనుబంధానికి రాఖీ పండుగ

నర్సాపూర్ (వాయిస్ టుడే) : అన్న చెల్లెలు అనుబంధానికి ప్రతికంగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగ ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలకాలం ఉండాలని వారిని ఆశీర్వదించారు రాఖి అనేది కేవలం ఒక దారం మాత్రమే కాదు అన్న చెల్లెలు మధ్య ఉన్న ప్రేమ ఆప్యాయత నమ్మకానికి ప్రత్యేకంగా భావిస్తారు సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమెను కాపాడుకుంటానని మాట ఇస్తూ పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది కొత్త వస్త్రాలు దర్శించి పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఆనందంగా కుటుంబ సభ్యుల మధ్యన జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు ప్రతి సంవత్సరం జరిగే ఈ రాఖీ పౌర్ణమి ఎల్లప్పుడు ఇలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తమ కుటుంబ సభ్యులు ఉండాలని వారి సోదరీమణులు కోరుకున్నారుఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వారి సోదరీమణులు సోదరులు పాల్గొన్నారు.



## ఇసుక బాయ్ గూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కడుతున్న సామ హేమశ్రీ

మాడులపల్లి ఆగస్టు 28 ( వాయిస్ టుడే): రక్షాబంధన్ పర్వదినం రోజున మహిళలకు రాజ్యాంగం ద్వారా రక్షణ, విద్యా, సమాన హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కి దక్కిందని రాఖీ కట్టి, సామ హేమశ్రీ సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని అందించారు. ఆడపిల్లలకు కేవలం సోదరుల నుండే కాకుండా, రాజ్యాంగం కల్పించిన చట్టాల వల్ల కూడా నిజమైన స్వాతంత్రం సౌభ్రాతృత్వం రక్షణ లభిస్తుందనే ఆమె ఆలోచనా విధానం ఎంతో అభినందనీయం అని పలువురు అభినందించారు



## ముదిగొండలో ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ ఆవిర్భావ దినోత్సవం

ముదిగొండ మండలం ఆగస్ట్ 28 (వాయిస్ టుడే) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వికలాంగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి ఎల్. భద్రం మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నారపంగు జానీ మాదిగ, ఎంఎస్పీ మాజీ మండల అధ్యక్షుడు పడిశాల నాగేశ్వరరావు మాదిగ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ముదిగొండ మండల అధ్యక్షుడు గుంజులూరు రాంబాబు మాదిగ, ఉపాధ్యక్షుడు షేక్ సైదా పాషా, ఎంఎస్పీ వెంకటాపురం గ్రామ అధ్యక్షుడు సురేష్ మాదిగ, మేడిపల్లి విహెచ్‌పిఎస్ గ్రామ అధ్యక్షురాలు సరూప రాణి, మండల నాయకులు కోటయ్య మాదిగ, నాగేశ్వరరావు మాదిగ, జాఫర్, మానస, లక్ష్మయ్యలతో పాటు విహెచ్‌పిఎస్ వెంకటాపురం గ్రామ కమిటీ సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర ప్రేమకు ప్రతీక రాఖీ పౌర్ణమి

### అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్



ఝరాసంగం, ఆగస్టు 28 (వాయిస్ టుడే): పవిత్రమైన ప్రేమను చాటి చెప్పేదే రాఖీ పౌర్ణమి. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు, సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే రక్షాబంధన్ పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఈ పర్వదినాన అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటారు.

#### అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదం.. అంతా శుభమే

పూర్వకాలం నుంచి అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదం తీసుకుంటే అన్నదమ్ములు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారనే నమ్మకం ఉంది. అందుకే శుభకార్యాలను ప్రారంభించే ముందు అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదం తీసుకునే ఆచారం కొనసాగుతోంది. ముఖ్యంగా వివాహ శుభకార్యాల్లో మొదటి ఆహ్వానపత్రికను ఇంటి ఆడపడుచుకు అందించడంతో పాటు కుంకుమ, పసుపు, కుడుకలు అందించే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. శ్రావణ మాసంలో రక్షాబంధన్ రోజున అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు తీసుకుంటే ఆ సంవత్సరం అన్నదమ్ములకు అంతా శుభమే జరుగుతుందని పెద్దలు విశ్వసిస్తారు. అందుకే ప్రతి సంవత్సరం సోదరీమణులు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఎంతో మురిసిపోతారు. అన్నదమ్ములు సైతం తమ సోదరీమణులకు కానుకలు అందించి, జీవితాంతం వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తారు.



## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

### ముగ్గురు అన్నదమ్ములకు రాఖీలు కట్టిన చిన్నారి

ఝరాసంగం, ఆగస్టు 28 (వాయిస్ టుడే) : ఝరాసంగంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి తన ముగ్గురు అన్నదమ్ములకు ప్రేమగా రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను కోరుకుంది. రాఖీలు కట్టిన అనంతరం అన్నదమ్ములు చిన్నారికి అందించి తమ ప్రేమను చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుంది. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే రక్షాబంధన్ పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఈ పర్వదినం కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలను మరింతగా పెంపొందిస్తుందని ముగ్గురు అన్నదమ్ములు చిన్నారి రాఖీ కట్టిన పండుగ జరుపుకున్నారు.

## పండుగ పూట పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ఎనిమిది మంది అరెస్ట్

దంతాలపల్లి ఆగస్టు28(వాయిస్ టుడే): తొర్రూరు మండలం కిష్టాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై తొర్రూరు ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారంనాడు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన జెట్టి యాకయ్య, అల్లి సంపత్, కొత్తపల్లి శంకర్, ఎలతూరీ నరేష్, ఎలతూరీ యశ్వంత్, కొత్తపల్లి సందీప్, కొత్తపల్లి రాజు (తండ్రి: చంద్రయ్య), తొర్రూర్ మండలం మాటెడ్ గ్రామానికి చెందిన ముత్యం వెంకన్న పేకాట ఆడుతూ ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.24,150 నగదు, ఒక కారు, ఒక ఆటో, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

### హాజరైన ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు



ఖైరతాబాద్, ఆగస్టు 28: సోదరభావానికి, ఆత్మీయ అనురాగాలకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్ గౌడ్ పాల్గొని ప్రజలకు, పార్టీ శ్రేణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడిగె సమంత, దోమకొండ కిషోర్, కోటం రవీందర్, గడ్డం సాయి పాల్గొన్నారు.



# మైదానంలో గంట.. ఆరోగ్యానికి బలమైన బాట

### - ఏక్ గంట్ ఖేల్ కే మైదాన్ మే’అంటూ సందేశం

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఆగస్టు-28 (వాయిస్ టుడే) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా సుల్తానాబాద్ ఖేల్ ఇండియా సెంటర్‌లో శుక్రవారం వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.తొలిరోజు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులు, విద్యార్థులకు వివిధ క్రీడలు, వ్యాయామాలపై అవగాహన కల్పించారు. ‘ఏక్ గంట్ ఖేల్ కే మైదాన్ మే’ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రోజూ కనీసం గంటసేపు మైదానంలో క్రీడలు, వ్యాయామానికి కేటాయించాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆరోగ్యంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరమన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ ఒక గంట మైదానంలో గడపాలని సూచించారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు కేవలం పోటీలకు మాత్రమే పరిమితం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగం కావాలని నిర్వాహకులు సూచించారు. మైదానంలో ప్రతిరోజూ కొంత సమయం గడపడం ద్వారా శారీరక చురుకుదనం పెరుగుతుందని, ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచుకోవచ్చని తెలిపారు.

#### క్రీడాకారులకు అరటి పండ్ల పంపిణీ

జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అరటిపండ్లు పంపిణీ చేశారు. క్రీడాకారులు ఉత్సాహంగా వివిధ క్రీడా, వ్యాయామ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నెల ముప్పై వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఏ. సురేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీరిశెట్టి తిరుపతి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య, కోచ్ గెల్లు మధుకర్, ఫిజికల్ డైరెక్టర్లు టి. ప్రణయ్, కె. వెంకటేష్, రాకేష్, అజ్జు, ఎల్లరాజు, సాధుల సుగుణాకర్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు డివిజన్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

### వెల్లివిరిసిన ప్రేమానురాగాలు



తొర్రూరు, ఆగస్ట్ 28 (వాయిస్ టుడే) : తొర్రూరు డివిజన్ కేంద్రంతో సహా డివిజన్ పరిధిలోని పలు మండలాలు గ్రామాల్లో శుక్రవారం నాడు రక్షాబంధన్ పర్వదిన వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా, అత్యంత ఆనందోత్సాహాలతో, ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకైన రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు డివిజన్ వ్యాప్తంగా ప్రతి ఇంట్లో పండుగ వాతావరణంతో కూడిన ఆనందోత్సాహాలు, ప్రేమానురాగాలు వెల్లివిరిసాయి. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుండే అక్క చెల్లెల్లు తమ సోదరులకు రాఖీలు కట్టి వారు ఆయురారోగ్యాలతో , అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో తులతూగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందజేశారు. రాఖీ పండుగ సందర్భంగా తమ తమ సోదరులకు రాఖీలు కట్టి వారు కలకాలం తమకు రక్షగా ఉండాలని ఆడపడుచులు ఆకాంక్షించారు. తమకు రాఖీలు కట్టిన సోదరీమణులకు సోదరులు తమ శక్తి మేరకు బహుమతులు, కానుకలు అందజేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కలకాలం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు . రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో రాఖీలు అమ్మే దుకాణాలు వినియోగదారులతో సందడిగా కనిపించాయి. అదేవిధంగా మిఠాయి దుకాణాలు కూడా పెద్ద ఎత్తున వినియోగదారులతో కళకళలాడాయి. రాఖీలు కట్టి తమ సోదరులకు మంగళహారతులు ఇచ్చి సోదరీమణులు రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పండుగ రోజున తమ తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు తమ గ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన మహిళా ప్రయాణికులతో తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్, పరిసర ప్రాంతాలు ఎంతో సందడిగా కనిపించాయి.

## సామూహికంగా అమ్మవారి నామ పారాయణం

ఖమ్మం , ఆగస్టు 28 ( వాయిస్ టుడే ): పవిత్ర శ్రావణ మాస సందర్భంగా, నిత్యం అంతటా అమ్మవారి నామ పారాయణం, గానం, స్తోత్రాలు, పఠించే నేపథ్యంలో, స్థానిక శివాలయం వీధి, బ్రాహ్మణ బజార్లో గల పద్మ అమ్మవారి స్వగృహంలో, భక్తి శ్రద్ధలతో అమ్మవారి నామ పారాయణ సామూహికంగా, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలంతా ముక్తకంఠంతో అమ్మవారికి సంబంధించిన స్తోత్రాల ను భక్తి శ్రద్ధలతో ఆలపించారు. జగన్మాత దయాదక్షిణ్యాలు అందరి పైన ఉండాలని, అభినషించారు.

## ప్రేమ, ఆప్యాయతలకు రాఖీ పండుగ ప్రతీక: జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఆగస్టు -28 ( వాయిస్ టుడే): సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బ్రహ్మకుమారీలు జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టి, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆప్యాయతలను పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. సోదరీమణుల రక్షణ, గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కుటుంబం, సమాజం మొత్తానికి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులు, భద్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. రాఖీ పండుగ కేవలం సోదర, సోదరీమణుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సోదరభావంతో, ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు రాజయోగిని, బికె. అరుణ, బికె.గీత తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్ బషీర్ బాగ్ అమరుల త్యాగఫలితమే



తొర్రూరు, ఆగస్ట్ 28 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్రంలో పేద సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి అందుతున్న ఉచిత విద్యుత్ నాటి బషీర్ బాగ్ అమరవీరుల త్యాగ ఫలితమేనని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బషీర్బాగ్ విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద విష్ణువర్ధన్,రామకృష్ణ, బాలస్వామి లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు అనుకూల సంస్కరణలు అమలు చేస్తున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు మూడు నెలలు దశలవారీగా దీర్ఘకాలిక మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను కాదని పెట్టుబడిదారుల అనుకూల సంస్కరణలు అమలు చేసిన నాటి ప్రభుత్వం పై తెలుగు ప్రజలు చారిత్రాత్మక పోరాటం నడిపారని అన్నారు. నేడు రాష్ట్రంలోని కాంగ్రెస్ కేంద్రంలోని బిజెపి సామ్రాజ్యవాద, గుత్త పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. ఎంతో ఘనమైన పోరాట చరిత్ర గలిగిన ప్రజలు మొరోసారి ఉద్యమించటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.పాలకవర్గాలు దీనిని గమనించి తగు పద్ధతిలో ప్రజా అనుకూల పరిపాలన చేయాలని కోరారు. నాడు చార్జీల తగ్గింపు పోరాటం తర్వాత 25 సంవత్సరాలుగా కరెంటు చార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్న విషయాన్ని దృష్టికి తెచ్చారు. నేడు విద్య, వైద్య,ఉద్యోగం, ఉపాధి హక్కులకై ఢిల్లీలో జెంజీ పోరాటాలు, రైతాంగం నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల ఆందోళన లేబర్ కోడ్స్ కి వ్యతిరేకంగా కార్మిక హక్కుల పోరాటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని అన్నారు. హైదరాబాద్ బషీర్బాగ్ వద్ద 50 వేల మంది ప్రజలపై 2020లో జరిపిన అమానుష కాల్పుల్లో విష్ణువర్ధన్ రామకృష్ణ బాలస్వామి లతోపాటు వేలాదిమంది తీవ్ర గాయాల పాలై అష్ట కష్టాలు అనుభవించిన నేటికీ ఆ పోరాట స్ఫూర్తి తగ్గలేదని రవి అన్నారు. సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముందంపల్లి వీరన్న మాట్లాడుతూ ఉచిత కరెంటు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికంటి వెంకన్న, పుల్లయ్య, బాలు, ప్రసాద్, వెంకన్న, మహేందర్, మురళి ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.